క్లుప్తంగా

బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న స్థానిక మహిళ

గుంటూరు రూరల్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. గురువారం 47వ డివిజన్ గోరంట్లలోని మేరి ప్రియనగర్‌లో కాలనీ వాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేయనున్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

చేబ్రోలు: వడ్లమూడి గ్రామంలో గురువారం కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పండితులు వివిధ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. గరుడ ఆంజనేయ, విమాన శిఖర జీవధ్వజ ప్రతిష్ఠ మహోత్సవంలో పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులకు అన్నదానం జరిపారు. వడ్లమూడి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



కాకుమాను: గర్భిణుల పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కాకుమాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంపై ఏఎన్‌ఎంలు, గర్భిణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, సిబ్బంది ఆయా గ్రామాల్లోని గర్భిణులను గుర్తించి వారు ఆరోగ్య సంరక్షణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందుల గురించి వివరించి తల్లీబిడ్డా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండే విధంగా చూడాలని తెలిపారు. ముఖ్యంగా బలహీనంగా ఉన్నా, రక్తహీనత ఉన్నా గుర్తించి వైద్యశాలకు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో వైద్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



కాకుమాను: ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఫిజియోథెరపిస్ట్ నాగమల్లేశ్వరరావు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో గురువారం ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను తల్లిదండ్రులు అన్నివిధాలుగా ప్రోత్సహించాలని సూచించారు. ఎంఈఓ కేఎఫ్ కెనడీ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏ ఒక్కరు అధైర్యపడకుండా విద్యలో రాణించి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ టీచర్ దయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డుల చేయూత అభినందనీయం

నగరంపాలెం: ఉద్యోగ విరమణ చేసిన మహిళా హోంగార్డుకు సహచర హోంగార్డులు ఆర్థికంగా చేయూతనివ్వడం అభినందనీయమని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. గతేడాది సెప్టెంబర్ 9న ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు జి.కనకదుర్గకు హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.32 లక్షల చెక్కుని గురువారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందించారు. ఆర్ఐ రమేష్‌కృష్ణన్, ఎన్‌సీఓ శ్రీనివాస్, సుధీర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ నిరంతర ప్రక్రియ

- నడింపాలెం పంచాయతీ ఆదర్శం కావాలి
- రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఇక్కడే అన్ని గ్రామ పంచాయతీలకు శిక్షణ
- పంచాయతీరాజ్ డెప్యూటీ కమిషనర్ రోహిణి



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ డెప్యూటీ కమిషనర్ రోహిణి, వేదికపై జిల్లా పంచాయతీ అధికారి కేశవరెడ్డి, జెడ్పీ సీఈవో మోహనరావు

నడింపాలెం (ప్రత్తిపాడు): ప్రతి రోజూ పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని పంచాయతీరాజ్ డెప్యూటీ కమిషనర్ రోహిణి అన్నారు. నడింపాలెం పంచాయతీలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డును లోకల్ ట్రైనింగ్ సెంటర్ (ఎల్‌టీసీ)గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గురువారం శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పంచాయతీరాజ్ డెప్యూటీ కమిషనర్ రోహిణి కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రోహిణి మాట్లాడుతూ రోజూ ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించే వారు సంబంధిత యాప్‌లో నమోదు చేయడం లేదని, చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల వారు ర్యాంకింగ్‌లో అడుగున ఉంటున్నారన్నారు. ఈ రోజుల్లో కేవలం పనిచేస్తే సరిపోదని, పని చేస్తున్నామని ప్రూవ్ చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. గ్రామంలో అమలవుతున్న వాటిని యాప్‌లో కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ చేయవలసిన అవసరం ఉందని చెప్పారు. గ్రామ పరిశుభ్రత అనేది ఒక్క రోజుతో అయ్యే పనికాదని, ఇది నిరంతరం జరిగే ప్రక్రియ అని వివరించారు. గ్రామ పంచాయతీ పరిశుభ్రంగా ఉందన్నారు. శానిటేషన్ విషయంలో కొంత నెగటివ్ దృక్పథం ఉంటుందని, కానీ ఇక్కడ అలా లేదని చెప్పారు. ప్రజలు, అధికారులు కలిసి పారిశుద్ధ్య నిర్వహణకు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తున్న విధానం, తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానాలను స్వయంగా రోహిణి పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో మోహనరావు, ఎంపీడీవో శ్రీరమ్య, ఈవోపీఆర్డీ మోషే, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలి

- విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య
- నిరులోత్సవ్- 2023 వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి అన్ని రంగాల్లో ముందుండాలని విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. గురువారం పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన నిరులోత్సవ్ 2023 యువజనోత్సవం వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అన్ని అంశాల్లో రాణించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక మాట్లాడుతూ కళాశాలలో అతిపెద్ద యువజనోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. నిరులోత్సవ్ 2023లో భాగంగా కళాశాలలో సుమారు 40 రకాల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నిరులోత్సవ్ కార్యక్రమం మార్చి 4, 5 తేదీల్లో నిర్వహిస్తున్నామన్నారు. నిరులోత్సవంలో క్రీడలు, వివిధ రకాల పోటీలను జాతీయ స్థాయిలో నిర్వహిస్తారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే రాష్ట్రంలోని కళాశాలలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నిరులోత్సవ్ కన్వీనర్ వి.సుజాత, కో-కన్వీనర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో ఘనంగా ఐపీఆర్ అవగాహన సదస్సు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'వర్చువల్ వర్క్‌షాప్ ఆన్ ఐపీఆర్ అవేర్‌నెస్' అనే అంశంపై గురువారం అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌ను జరిగింది. వర్చువల్ విధానంలో జరిగిన కార్యక్రమంలో చెన్నైలోని ఇండియన్ పేటెంట్ ఆఫీస్‌లోని పేటెంట్స్ అండ్ డిజైన్స్ ఎగ్జామినర్ వి.తిలక్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సరికొత్త ఇన్నోవేషన్స్‌ను సృష్టించే విద్యార్థులు వాటిపై పేటెంట్స్‌ను పొందడం వల్ల దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. రీసెర్చ్ జర్నల్స్ కోసం ప్రయత్నించకుండా విద్యార్థులు పేటెంట్స్‌ను సాధించినట్లయితే వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడంతో పాటు ఆర్థిక ప్రయోజనాలు కూడా పొందుతారని పేర్కొన్నారు. పేటెంట్, డిజైన్, ట్రేడ్‌మార్క్, కాపీరైట్, జియోగ్రాఫికల్ ఇండికేషన్, ఎస్ఐసీఎల్‌డీ, ట్రేడ్ సీక్రెట్, ట్రెడిషనల్ నాలెడ్జ్, గ్రాడ్యుయేషన్ తర్వాత విద్యార్థులకు ఉన్న కెరీర్ ఆపర్చునిటీస్ వంటి అంశాలను వివరించారు. విద్యా సంస్థల నుంచి అప్లై చేసే పేటెంట్లకు గతంలో ఉన్న రూ.25 వేల ఫీజును ప్రభుత్వం రూ.5,600కు తీసుకుని వచ్చిందని తెలియజేశారు. ఈ-సెల్ డైరెక్టర్ బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తక్కెళ్లపాడులో కొత్త వివాదానికి తెర

వీధుల్లో బెంచీలకు పసుపు రంగు



తక్కెళ్లపాడు వీధుల్లో పసుపు రంగులు వేసిన సిమెంట్ బెంచీలు

పెదకాకాని: తక్కెళ్లపాడు గ్రామ వీధుల్లో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలకు పుసుపు రంగులు వేయడం గ్రామంలో చర్చనీయాంశమైంది. పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామంలో సిమెంట్ బెంచీల ఏర్పాటు చేయడానికి తీర్మానం చేశారు. ఒక్కొక్క బెంచీకి 4,500 రూపాయలు చొప్పున బిల్లు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. వాస్తవానికి కాంట్రాక్టర్‌కు మూడు వేల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నట్లు సమాచారం. సిమెంట్ బెంచీలకు పసుపు రంగు వేయడంతో గ్రామంలో కొత్త వివాదానికి దారితీసింది. గతంలో ఇదే గ్రామంలో రెండు పర్యాయాలు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసినా పార్టీల రంగులు గానీ, సర్పంచ్ పేరు గానీ కనిపించలేదు. గతంలో పంచాయతీ కార్యాలయానికి వైఎస్సార్ సీపీ రంగులు వేశారని జీర్ణించుకోలేని పచ్చ శ్రేణులు ఆ రంగులపై తెల్లసున్నం వేయడం, నల్ల రంగులు పోయడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారు. ప్రస్తుతం బెంచీలపై ఏరియాల వారీగా కనీసం వార్డు సభ్యుల పేర్లు కూడా వేయించలేదు. పారిశుద్ధ్య కార్మికులకు పరికరాలు, బ్లీచింగ్, సున్నం కొనడానికి డబ్బులు లేవని చెప్పే పంచాయతీ అధికారులు ప్రజాధనాన్ని పచ్చ బెంచీల కోసం ఖర్చు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో చెత్త బండిలాగే వారి జీతాలు వాడుకున్న వ్యవహారంలోనూ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. పంచాయతీ నిధులు ఖర్చు చేసి దర్జాగా పచ్చ బెంచీలు మాత్రం ఏర్పాటు చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఉమాదేవిని వివరణ కోరగా సిమెంట్ బెంచీల ఏర్పాటుకు తీర్మానం జరిగిందని, అందులో రంగు మాత్రం పేర్కొనలేదని సమాధానం చెప్పారు. ఉన్నతాధికారులతో చర్చించి బెంచీలకు పసుపు రంగు వేయడంపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో పసుపు బెంచీలు ఏర్పాటు చేయడంపై వార్డు సభ్యుడు కగ్గా శివయ్య పంచాయతీ అధికారులను వివరణ కోరినప్పటికీ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో జిల్లా కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు చేబ్రోలులో గృహసారథులు, కన్వీనర్ల సదస్సు

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని వైఎస్సార్ సీపీ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు శుక్రవారం అవగాహన సదస్సు జరుగుతుందని డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు గురువారం తెలిపారు. చేబ్రోలులోని పరిమి సత్యనారాయణ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు చేబ్రోలులోని ఐదు సచివాలయాలు, మంచాల, శ్రీరంగపురం, గొడవర్రు సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులకు సమావేశం జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిధిలోని వేజండ్ల గ్రామంలోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో నారాకోడూరు, వేజండ్ల, వడ్లమూడి, సుద్దపల్లి, శలపాడు, శేకూరు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ గృహ సారథులతో సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య తదితరులు హాజరవుతున్నట్లు కుర్రా పాములు తెలిపారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం



సర్వేలో భాగంగా లెప్రసీ అనుమానిత వ్యక్తులను పరిశీలిస్తున్న డీపీఎంవో కోటేశ్వరరావు నాయక్

ప్రత్తిపాడు: కుష్ఠు వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని డీపీఎంవో కోటేశ్వరరావు నాయక్ అన్నారు. జాతీయ లెప్రసీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పర్శ్ లెప్రసీపై కొద్ది రోజులుగా అవగాహన కార్యక్రమాలతో పాటు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటి సర్వే చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కుష్ఠు అనుమానిత కేసులను పరిశీలించేందుకు గురువారం డీపీఎంవో కోటేశ్వరరావు ప్రత్తిపాడులో పర్యటించారు. కుష్ఠు అనుమానిత వ్యక్తులను వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ లెప్రసీతో పోరాడుదాం, కుష్ఠు వ్యాధిని చరిత్రగా చేద్దామని పిలుపునిచ్చారు.

సురక్షిత తాగునీరే లక్ష్యం

వెల్లలూరు(చేబ్రోలు): ప్రతి ఇంటికి జలజీవన్ మిషన్ ద్వారా సురక్షిత తాగునీరు అందించటమే లక్ష్యమని జలజీవన్ మిషన్ సభ్యులు తెలిపారు. పొన్నూరు మండలం వెల్లలూరు గ్రామ సచివాలయాన్ని జలజీవన్ మిషన్ ప్రత్యేక బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు, పంచాయతీ సభ్యులు, పారిశుద్ధ్య కమిటీ సభ్యులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సచివాలయం వద్ద నీటి నమూనా పరీక్షలను నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, ఎస్సీ కాలనీలోని తాగునీటి చెరువును పరిశీలించారు. ఎంపీడీవో శేషమాంబ, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

నేడు పెదకాకానిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకాకాని: పెదకాకాని గ్రామంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ బత్తుల శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామంలోని పడమర వైపు సుందరయ్య కాలనీ, గౌడపాలెం, సదాశివ కాలనీ, అంబేడ్కర్ నగర్, కాకాని సెంటర్, తహసీల్దార్ కార్యాలయం ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడనున్న అంతరాయానికి వినియోగదారులు సహకరించాలన్నారు.

చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చెస్ పోటీలు



అంతర్ కళాశాలల పురుషుల చెస్ టోర్నమెంటు పోటీల్లో విద్యార్థులు

చేబ్రోలు: చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల చెస్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో యూనివర్సిటీ జట్టును ప్రకటించనున్నారు. నాగార్జున యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పి.జాన్సన్ విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. మేధాశక్తిని పెంచే చెస్ పట్ల విద్యార్థులు ఆసక్తి కనబరచాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మస్తాన్‌షా ఉరుసు మహోత్సవాలు

పాత గుంటూరు: గుంటూరు జీటీ రోడ్డులోని హజరత్ కాలేమస్తాన్‌షా ఆవులియా ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దర్గా ధర్మకర్త రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన గంధం మహోత్సవం నగర ప్రధాన వీధుల్లో కొనసాగుతూ గురువారం ఉదయం 10 గంటల వరకు ఘనంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. బాబా దర్శనానికి వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మధ్యాహ్నం, సాయంత్రం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 4 గంటలకు గంధ పంపిణీ, దీపారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగర ప్రముఖులు, భక్తులు విశేష సంఖ్యలో బాబా సమాధిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఏఆర్టీ సేవలు మరింత చేరువ

గుంటూరు మెడికల్: హెచ్ఐవీతో జీవిస్తూ ఏఆర్టీ మందులు వాడే వారికి లింక్ ఏఆర్టీ సెంటర్లలో మందులు అందిస్తున్నట్లు జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ తెలిపారు. రోగులు 50 కిలోమీటర్ల పైబడి ప్రయాణం చేయడం వ్యయ ప్రయాసలతో కూడుకున్న దృష్ట్యా ప్రభుత్వం, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు వారికి మరింత చెరువులో మందులు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. గుంటూరు సమగ్ర వైద్యశాల ఏఆర్టీ ప్లస్‌లో గురువారం నిర్వహించిన కో-ఆర్డినేషన్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏఆర్టీ సిబ్బంది, స్వచ్ఛంద సేవ సంస్థలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ మేనేజర్ లంకపల్లి మధుసూదనరావు మాట్లాడుతూ హెపటైటిస్ బీ గురించి అవగాహన కల్పించడంతో పాటు హెచ్ఐవీతో జీవిస్తున్న వారందరికీ వ్యాక్సిన్ అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రభాకరరావు, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.రత్న కుమార్, ఏఆర్టీ మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' నినాదం ప్రతి ఇంటికి చేరాలి

- పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- పొన్నూరులో గృహ సారథులు, కన్వీనర్లు, వలంటీర్ల అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, వేదికపై కో-ఆర్డినేటర్ రవీంద్రనాథ్‌రెడ్డి

పొన్నూరు(చేబ్రోలు): మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదం ప్రతి ఇంటికి చేరాలని, రానున్న ఎన్నికల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులే వైఎస్సార్ సీపీ విజయ సారథులని పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణంలోని రోటరీ క్లబ్‌లో పట్టణ పరిధిలోని 1 నుంచి 9 సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి అందరూ ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసినట్లు తెలిపారు. గృహ సారథుల మూడు జిల్లాల కో-ఆర్డినేటర్ రవీంద్రనాథ్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం

- ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్
- 10, 11న కళాశాల 38వ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

గుంటూరు రూరల్: విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించడంలో తమ కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10, 11 తేదీలలో రెండు రోజుల పాటు కళాశాల 38వ వార్షికోత్సవం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈనెల 10న కలరిడో-2023 పేరుతో జాతీయ స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశంలోని ఇంజినీరింగ్ కళాశాలల నుంచి భారీగా విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు. మొదటి రోజు కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ కె.రామమోహనరావు, గౌరవ అతిథులుగా తెలుగు చలన చిత్ర యువనటుడు హీరో రక్షిత్ పాల్గొంటారన్నారు. 11వ తేదీ రెండవ రోజు కార్యక్రమాలకు టీసీఎస్ వైస్ ప్రెసిడెంట్ గ్లోబల్ ఆర్ఎంజీ హెడ్ ఎస్.చక్రవర్తి, చలన చిత్ర నవ హీరో కాకాని ధర్మమహేష్ పాల్గొంటారన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో సాంస్కృతిక, క్రీడలు, నృత్య ప్రదర్శనలు, మిమిక్రీ తదితర పోటీలను నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్నవారితో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబానికి ఒక కొడుకుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని నేరుగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి గడపకు అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్న అని తెలిపారు. ప్రతిపక్షాలు కుట్రలు పన్ని ప్రజలు లబ్ధి పొందకుండా ఉండేందుకు అనేక అడ్డంకులు సృష్టిస్తున్నా కులం, మతం, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చి చరిత్రను సృష్టించారన్నారు. కార్యక్రమంలో భాగంగా వల్లూరు గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్‌కు రూ.11 లక్షలు, కాండ్రు వెంకట్ (బీకే పాలెం)కు రూ.3 లక్షలు, బడుగు మేరికుమారి (పుడివాడ గ్రామం)కు రూ.2 లక్షలు, బొంతా సుధాకర్ (రేటూరు)కు రూ.5 లక్షలు, వద్దినేని తిలోత్తమ (కాకుమాను)కు రూ2 లక్షలు, మండే సిఫోర (హాఫ్‌పేట)కు రూ.లక్ష, రామినేని వరలక్ష్మి (కొండపాటూరు) రూ.2 లక్షలు, గోవతోటి శాంతిసుధాకర్ (రాజీవ్‌గాంధీనగర్)కు రూ.3 లక్షలు, గోళ్ల విజయలక్ష్మి (గోరంట్ల)కు రూ.3 లక్షలు, పొత్తూరి రామకృష్ణ (కాకుమాను)కు లక్ష రూపాయలు వంతున రూ.33 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారుల కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో లబ్ధిదారుల కుటుంబాలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి

సాయిల్ సైంటిస్ట్ డాక్టర్ బి.శ్రీహరిరావు



ఘన, ద్రవ జీవామృతాల తయారీని వివరిస్తున్న రైతు నేస్తం అధికారులు

గుంటూరు రూరల్: నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రైతులు నేలలో సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సాయిల్ సైంటిస్ట్ డాక్టర్ బి.శ్రీహరిరావు తెలిపారు. గురువారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో సేంద్రియ వ్యవసాయం, సేంద్రియ ఎరువులు, కషాయాల తయారీపై రైతు శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిల్ సైంటిస్ట్ మాట్లాడుతూ నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట పైర్లు వేయడం, ప్రకృతి సాగుచేస్తే భూమి ఆరోగ్యంతో పాటు ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చన్నారు. రైతులు పండించిన సేంద్రియ ఉత్పత్తులను ఏవిధంగా మార్కెటింగ్ చేసుకోవాలి, ఉత్పత్తులకు విలువల జోడింపును డాక్టర్ గంగవరపు రామకృష్ణ తెలిపారు. ఘన జీవామృతం, జీవామృతం, సేంద్రియ వ్యవసాయంలో మెలకువలు, యాజమాన్య పద్ధతులను రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు సర్టిఫికెట్లను అందజేశారు. వెటర్నరీ డాక్టర్ జి.రామకృష్ణ, ప్రకృతి రైతు శివనాగమల్లేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి ఎమ్మెల్యే సుచరిత పరామర్శ



కృష్ణారెడ్డిని పరామర్శించి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్పొరేటర్ తనబుద్దు కృష్ణారెడ్డిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఇన్‌కంటాక్స్ మాజీ కమిషనర్ మేకతోటి దయాసాగర్ పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, 48వ డివిజన్ కార్పొరేటర్ తనబుద్దు కృష్ణారెడ్డి గురువారం డివిజన్ పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దీంతో వెంటనే స్థానికులు నగర శివారుల్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆసుపత్రికి చేరుకున్నారు. వైద్యులతో మాట్లాడారు. బ్రెయిన్‌లో రక్తస్రావం అవ్వటం వల్ల ఆపరేషన్ చేయాల్సి వచ్చిందని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి పరవాలేదని వైద్యులు తెలిపారన్నారు. కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.